# నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలి



తిమ్మాపూర్: నుస్తులాపూర్‌లో వేడుకల్లో పాల్గొన్న సర్పంచ్, తదితరులు.

- కాలుష్య రహిత సమాజాన్ని భావితరాలకు అందించాలి
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు
- ఈదులగట్టెపల్లిలో సంపద వనాల ప్రారంభోత్సవానికి హాజరు

మానకొండూర్ రూరల్, జూన్ 19: ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజల భాగస్వామ్యంతో విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు పిలుపునిచ్చారు. హరితోత్సవ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని ఈదుల గట్టెపల్లి గ్రామ శివారులోని కాకతీయ కెనాల్ ప్రాంతంలో డీఆర్‌డీవో శ్రీలత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంపద వనాలను అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జీవీ రామకృష్ణారావు మాట్లాడుతూ, విరివిగా మొక్కలు నాటి, కాలుష్య రహిత సమాజాన్ని భావితరాలకు అందించాలని సూచించారు. అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ మాట్లాడుతూ, పల్లెల్లో నర్సరీలు, ప్లాంటేషన్ నిరంతర ప్రక్రియ అని తెలిపారు. మండలంలో మూడు సంపద వనాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. అనంతరం మండలంలో మొక్కలను సంరక్షిస్తున్న ఈజీఎస్ సిబ్బంది, వన సంరక్షకులతో పాటు గ్రామ పంచాయతీ సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ దాసరి సరిత, ఎంపీపీ ముద్దసాని సులోచన, జడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్ గౌడ్, ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, ఎస్ఆర్ఎస్పీ ఎస్ఈ సురేశ్ కుమార్, ఈఈ నాగభూషణం, డీఈ సమ్మయ్య, ఎంపీవో రాజేశ్వర్ రావు, పంచాయతీ కార్యదర్శి స్వర్ణలత, వివిధ శాఖల అధికారులు, ఈజీఎస్ సిబ్బంది, వీవోలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**హరితహారంతో పల్లెలు సస్యశ్యామలం**

శంకరపట్నం, జూన్ 19: తెలంగాణ ప్రభుత్వం యేటా చేపడుతున్న హరితహారంతో పల్లెల్లో పచ్చదనం పెరిగిందని ఎంపీడీవో బషీరొద్దీన్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని అన్ని గ్రామాల్లో హరితోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తాడికల్‌లో సంపద వనాలు పేరుతో పండ్లు, తదితర 480 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో ఎటుచూసినా పంట పొలాలు, నర్సరీలు, అడవులతో పచ్చదనం వెల్లివిరుస్తున్నదని పేర్కొన్నారు. ఇప్పలపల్లిలో వననర్సరీలో వన సేవక్‌ను ఘనంగా సన్మానించారు. తాడికల్ జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులు హరితోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో బషీరొద్దీన్, ఏపీవో శారద, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు, టీఏలు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, ఈజీఎస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

**తిమ్మాపూర్‌లో..**

తిమ్మాపూర్, జూన్ 19: తిమ్మాపూర్, గన్నేరువరం మండలాల్లోని అన్ని గ్రామాల్లో సోమవారం హరితోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో మొక్కలు నాటి వేడుకలు జరిపారు. మహిళలు ముగ్గులు వేసి సంబురాలు జరుపుకొన్నారు. ప్రజాప్రతినిధులు తెలంగాణ ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణ కోసం చేస్తున్న కృషిని వివరించారు. గ్రామాల్లో ప్రతి ఇంటి ఆవరణలో మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



గన్నేరువరం మండలం ఖాసీంపేటలో వేడుకల్లో పాలకవర్గం.



శంకరపట్నం: మెట్‌పల్లిలో హరితోత్సవంలో పాల్గొన్న సర్పంచ్ సరోజన, గ్రామస్తులు

## హరితహారంతో వెల్లివిరుస్తున్న పచ్చదనం

తిమ్మాపూర్, జూన్19: ఇతర ప్రాంతాలతో పోల్చుకుంటే తెలంగాణలో పర్యావరణ మెరుగ్గా ఉందని జడ్పీ సీఈవో ప్రియాంక తెలిపారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని మహాత్మానగర్‌లో నిర్వహించిన హరితోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన సంపద వనాలను ఎంపీపీ కేతిరెడ్డి వనితాదేవేందర్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, హరితహారంతో ఎక్కడ చూసినా పచ్చదనం వెల్లివిరుస్తున్నదని తెలిపారు. కేవలం ప్రభుత్వమే కాకుండా ప్రజలు కూడా మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. అనంతరం మొక్కలను నాటి సంరక్షిస్తున్న పంచాయతీ సిబ్బంది, వన సంరక్షకులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవీందర్ రెడ్డి, సర్పంచ్ శ్రీవాణీరవీందర్, ఉపసర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీవో కిరణ్ కుమార్, ఎంఈవో శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



సంపద వనాన్ని ప్రారంభిస్తున్న జడ్పీ సీఈవో, ఎంపీపీ, తదితరులు

## పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం కృషి



ఈజీఎస్ సిబ్బందిని సన్మానిస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ

చిగురుమామిడి, జూన్ 19: పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నదని ఎంపీపీ కొత్త వినీతా శ్రీనివాస్ రెడ్డి, జడ్పీటీసీ గీకురు రవీందర్ తెలిపారు. సోమవారం హరితోత్సవ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయం వద్ద మొక్కలు నాటారు. అనంతరం వారు మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ చేపట్టిన హరితహారం కార్యక్రమంతో రాష్ట్రంలో అడవుల విస్తీర్ణం గణనీయంగా పెరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఈజీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఫొటో ప్రదర్శనను తిలకించారు. వన సంరక్షకుడు నీలికొండ కోటస్వామి, ఫీల్డ్ అసిస్టెంట్ పొగాకుల రమేశ్‌తో పాటు సిబ్బందిని ఎంపీపీ, జడ్పీటీసీ, అధికారులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నర్సయ్య, తహసీల్దార్ జయంత్, ఎంపీవో శ్రావణ్ కుమార్, పంచాయతీరాజ్ డీఈ రవికుమార్, మండల వ్యవసాయాధికారి రంజిత్ కుమార్, సర్పంచ్ బెజ్జంకి లక్ష్మణ్, ఏపీవో రాజయ్య, సెర్ప్ ఏపీఎం సంపత్, ఏఈవో ఫరీద్, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ, టీఏలు దుద్దేల అంజలి, ఆశ, వెంకటేశం, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, సెర్ప్ మహిళలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన బీఆర్ఎస్ నాయకులు

చిగురుమామిడి, జూన్ 19: మండలంలోని బీఆర్ఎస్ నాయకులు సోమవారం హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీశ్ కుమార్‌ను హనుమకొండలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మండల కేంద్రానికి చెందిన ఆర్బీఎస్ మండలాధ్యక్షుడు పెనుకుల తిరుపతి తన పుట్టినరోజు సందర్భంగా ఎమ్మెల్యే ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యేను బీఆర్ఎస్ నాయకులు శాలువా కప్పి సత్కరించారు. ఇక్కడ బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మామిడి అంజయ్య, మండల నాయకులు కత్తుల రమేశ్, బెజ్జంకి రాంబాబు, నాగెల్లి రాజిరెడ్డి తదితరులున్నారు.



ఆర్బీఎస్ మండలాధ్యక్షుడికి స్వీట్ తినిపిస్తున్న ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్

## సంపద వనాలతో భావితరాలకు ఎంతో మేలు

మానకొండూర్ రూరల్, జూన్ 19: పెద్ద సంఖ్యలో మొక్కలతో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న సంపద వనాలతో భావి తరాలకు ఎంతో మేలు జరుగుతుందని స్వచ్ఛ భారత్ జిల్లా కో ఆర్డినేటర్ (యునిసెఫ్) కిషన్ స్వామి అన్నారు. సోమవారం మండలంలోని ముంజంపల్లి గ్రామ శివారులో గల కాకతీయ కెనాల్ వద్ద ఏర్పాటు చేసిన సంపద వనంలో సర్పంచ్ రామంచ గోపాల్ రెడ్డితో కలిసి మొక్కలు నాటారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రజాప్రతినిధులు, ఈజీఎస్ సిబ్బంది, గ్రామస్తులు పది సంఖ్య ఆకృతిలో నిలబడి హరిత ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో స్వచ్ఛ భారత్ ఫెసిలేటర్ కల్యాణి, ఉప సర్పంచ్ పిట్టల కుమార స్వామి, టీపీ దండే సత్యానంద్, వీవోలు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, ఈజీఎస్ సిబ్బంది, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## 'జ్యోతిష్మతి' విద్యార్థుల ప్రతిభ

తిమ్మాపూర్, జూన్ 19: ఇటీవల సింగాపూర్ కిట్స్ కళాశాలలో జరిగిన నేషనల్ లెవెల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌లో జ్యోతిష్మతి అటానమస్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారని కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. బీటెక్ సెకండియర్ చదువుతున్న అభిరామ్ చదరంగంలో మొదటి స్థానంలో నిలిచి చాంపియన్ ట్రోఫీ అందుకోగా, బాలికల విభాగంలో టేబుల్ టెన్నిస్ డబుల్స్‌లో లహరి, శ్రీలేఖ మొదటి స్థానంలో నిలిచి బహుమతి సాధించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులను కళాశాల చైర్మన్‌తో పాటు ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు, డీన్ కే వైశాలి, పీడీ వెంకటేశ్వరరావు అభినందించారు.

## 30న మండల సర్వసభ్య సమావేశం

శంకరపట్నం, జూన్ 19: ఈ నెల 30న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బషీరొద్దీన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ ఉమ్మెంతల సరోజన అధ్యక్షతన ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం ప్రారంభమవుతుందని, ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు. మండలంలోని గ్రామాల అభివృద్ధి, సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు.

## మున్నూరు కాపు నాయకుల వినతి

తిమ్మాపూర్, జూన్ 19: మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సోమవారం ఆ సంఘం నాయకులు తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు మెంగని రమేశ్, నాయకులు బండమీది శ్రీనివాస్, చిందం మల్లేశం, ఆకుల శ్రీధర్‌తో పాటు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## 21న డీ సెట్ కౌన్సెలింగ్

తిమ్మాపూర్, జూన్ 19: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్, డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ కోర్సుల్లో ప్రవేశం కోసం రాసిన డీ సెట్‌లో అర్హత సాధించిన ఉమ్మడి జిల్లాలోని అభ్యర్థులకు ఈ నెల 21న ఎల్ఎండీ లోని డైట్ కళాశాలలో ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఉంటుందని కళాశాల ప్రిన్సిపాల్ మొండయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది గంటలకు ప్రారంభం అవుతుందని.. అభ్యర్థులు డీ సెట్ హాల్ టికెట్, ర్యాంక్ కార్డు, పది, ఇంటర్ మెమోలు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఏమైనా స్పెషల్ కేటగిరీ ఉంటే సంబంధిత సర్టిఫికెట్లు వెంట తెచ్చుకోవాలని పేర్కొన్నారు.

## వర్షాలు ఆలస్యం.. పంటలు వద్దు

తిమ్మాపూర్, జూన్ 19: రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాల రాక ఆలస్యం కావడంతో వర్షాలు ఆలస్యంగా వస్తాయని.. రైతులు తొందరపడి విత్తనాలు విత్తుకోవద్దని గన్నేరువరం మండల వ్యవసాయాధికారి కిరణ్మయి ఓ ప్రకటనలో సూచించారు. ప్రస్తుతం భూమిలో ఉష్ణోగ్రత ఎక్కువగా ఉన్నదని తెలిపారు. దీంతో విత్తనం మొలకెత్తకుండా చనిపోయే అవకాశం ఉందని, తద్వారా రైతుకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. నీటి వసతి ఉన్నప్పటికీ పత్తి రైతులు విత్తనాలు విత్తుకోకపోవడమే మంచిదని సూచించారు. వర్షాకాలంలో పత్తి విత్తనాలు జూలై 15 దాకా కూడా విత్తుకోవచ్చని, రైతులు ఇప్పుడే తొందర పడొద్దు అని సూచించారు.

## వివాహిత బలవన్మరణం

శంకరపట్నం, జూన్ 19: కల్వల గ్రామానికి చెందిన పల్లెపు మమత (35) అనే వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మమత కొంత కాలంగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నది. దీనికి తోడు ఆర్థిక సమస్యలు తలెత్తాయి. ఈ క్రమంలో మద్యానికి బానిసైంది. ఈ నెల 17న ఉదయం భర్త పల్లెపు కుమార్, కుటుంబ సభ్యులు కూలి పనులకు వెళ్లిన సమయంలో మమత ఇంట్లో ఉన్న మద్యం తాగింది. అదే మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం దవాఖానలో చేర్పించగా, అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందింది. మృతురాలి తల్లి శోభ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

## విద్యాదినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

చిగురుమామిడి, జూన్ 19: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాదినోత్సవం కోసం ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలోని 36 ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 2516 విద్యార్థులకు గానూ 16,500 ఉచిత పాఠ్యపుస్తకాలను ఇప్పటికే విద్యాశాఖ అధికారులు ఎమ్మార్సీకి సరఫరా చేయగా, పంపిణీని అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు లాంఛనంగా ప్రారంభించనున్నారు. వీటితోపాటు ఒక్కో విద్యార్థికి రెండు జతల దుస్తులు అందించనున్నారు. ములకనూరు గ్రామంలో కార్యక్రమాన్ని ఎంపీపీ, జడ్పీటీసీతోపాటు మండల స్థాయి అధికారులు లాంఛనంగా ప్రారంభించనున్నారు. కాగా, ఇప్పటికే ఎమ్మార్సీ నుంచి ఉపాధ్యాయులు ఆయా పాఠశాలలకు ఒకటి నుంచి పదో తరగతి వరకు పాఠ్యపుస్తకాలను తరలించారు.